సాక్షి అనంతపురం

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



టన్ను చీనీ రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.30 వేలు పలికాయి.



కిలో టమాట రూ.20

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టంగా రూ.8, సరాసరిన రూ.16 ప్రకారం పలికాయి.

గరిష్టం/కనిష్టం
34.7°/20.3°

జిల్లా అంతటా గురువారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున చలివాతావరణం మొదలైంది. గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో తూర్పు దిశగా గాలి వీచింది.

మెండుగా ఉపాధి



కంబదూరు మండల కేంద్రంలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న కూలీలు వీరు. గ్రామంలో అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నారు. గురువారం పనులకు 30 మంది వచ్చారు. ఇప్పటికే కొందరు వంద రోజులు పని పూర్తి చేసుకున్నారు. సగటున రోజు కూలీ రూ.270 అందుతోంది. ఉపాధి హామీ పథకంతో ఏడాది పొడవునా పనులు దొరుకుతున్నాయని కూలీలు రామాంజినేయులు, వెంకటేశులు, రమేష్, మంగమ్మ, తిమ్మక్క సంతోషం వెలిబుచ్చారు.



గుమ్మఘట్ట మండలం గోనబావి సమీపంలో పనులు చేసి ఇళ్లకెళ్తున్న మహిళా కూలీలు (ఫైల్)

- ఉమ్మడి జిల్లాలో ఉపాధికి నిధుల వరద
- రికార్డు స్థాయిలో కుటుంబాలకు లబ్ధి
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో భారీగా తగ్గిన వలసలు
- ప్రజల సంతోషాన్ని ఓర్వలేక 'పచ్చ' పత్రిక పిచ్చిరాతలు
- టీడీపీ హయాంలో 'నీరు–చెట్టు' పేరుతో దోచినా పట్టని వైనం

ఉమ్మడి జిల్లాలో జాబ్‌కార్డులు	4,23,065
లబ్ధి పొందిన కుటుంబాలు	4,23,065
హాజరైన కూలీలు	8.59 లక్షలు
కూలీలకు అందిన డబ్బు (రూ.లలో)	2,382.75 కోట్లు
మెటీరియల్ కోసం ఖర్చు (రూ.లలో)	1,128.43 కోట్లు

రాయదుర్గం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు దేశంలోనే ప్రత్యేకత చాటుకుంటున్నాయి. ఉన్న ఊళ్లోనే అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారు. నాలుగేళ్లలో కూలీల ఖాతాలకు ఉపాధి నిధులు వరదలా పారించారు. లక్షలాది కుటుంబాలకు లబ్ధి చేకూర్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పైసా కూలీల సంక్షేమానికే ఖర్చు చేశారు. గడిచిన నాలుగేళ్లలో రూ.2,382 కోట్లు కూలీలకు అందించారు. 1,128.43 కోట్లు మెటీరియల్ రూపంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలు వంటి భవన నిర్మాణాలకు వినియోగించారు. ఇలా ప్రతి పైసా సద్వినియోగం చేస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారు.

కష్టకాలంలోనూ అండ..

కరోనా లాంటి విపత్తులో ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా గ్రామాలకు వచ్చి చేరారు. వారందరికీ సీఎం వైఎస్ జగన్ అండగా నిలిచారు. గ్రామ సచివాలయాల్లోనే జాబ్‌కార్డులు అందించి ఉపాధి పనుల్లో భాగస్వాముల్ని చేశారు. అడిగిన ప్రతి ఒక్కరికీ ఉన్న ఊళ్లోనే పనులు కల్పించి వారి జీవనోపాధికి తోడ్పాటు అందించారు.

'నీరు–చెట్టు'తో రూ.వేల కోట్లు వృథా..

టీడీపీ హయాంలో ఉపాధి నిధులన్నీ నీరు–చెట్టు పథకానికి మళ్లించారు. ప్రతి వంక, వాగులను స్వాధీనం చేసుకుని కొల్లగొట్టారు. కూలీల నోట్లో మట్టికొట్టారు. తమ జేబుల్లోకి రూ.వేల కోట్లు వేసుకున్నారు. పనులు లేక ఆనాడు ఊళ్లకు ఊళ్లు ఖాళీలు చేసిన దుస్థితి.

వలసన్న మాటే లేదు..

ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు మినహా నిజమైన కూలీలు తమ గ్రామాలు వదిలి నేడు ఎక్కడికీ వెళ్లడం లేదు. అయినా, టీడీపీ, దానికి వంత పాడే ఓ పత్రిక మాత్రం పచ్చసిరాతో పిచ్చిరాతలు రాస్తోంది. టీడీపీ హయాంలో పనిదినాల్లోనూ కోత విధించి రాక్షసుల్లా పంచుకుతిన్నా మాట్లాడని వారు నేడు ఎలా పడితే రాస్తుండడం చూసి జనం అసహ్యించుకుంటున్నారు.

సద్వినియోగం చేసుకుంటున్నాం



ఉపాధి పనులు సంతృప్త స్థాయిలో కల్పిస్తున్నారు. పనులు చేసిన సత్వరం కూలి వేతనం కూడా ప్రభుత్వం జమ చేస్తోంది. ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నాం. ఎక్కువ ఆదాయం ఆశించే వారు మాత్రమే పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు. అలాంటి వారు పండుగలు, శుభ కార్యాలయాలకు మాత్రమే వచ్చి వెళుతుంటారు.
– బోయ అనంతమ్మ, ఉపాధి కూలీ, జుంజురాంపల్లి, రాయదుర్గం మండలం

దుష్ప్రచారం తగదు



గ్రామంలో అడిగిన వారందరికీ పనులు కల్పిస్తున్నారు. వలసలు వెళ్లాల్సిన అవసరం ఏ ఒక్కరికీ లేదు. ఇప్పటికే చాలా మంది వంద రోజుల పని దినాలు కూడా పూర్తి చేశారు. కరోనా సమయంలోనూ ఏ లోటు లేకుండా పనులు కల్పించి ఆకలిబాధలు తీర్చారు. కొంత మంది చేస్తోంది దుష్ప్రచారం మాత్రమే. అందులో ఎలాంటి వాస్తవం లేదు.
– రుక్మిణీ, ఉపాధి కూలీ, గొడిశెలపల్లి, డి హీరేహాళ్ మండలం

టాప్‌లో నిలబెట్టాం



కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాం. ప్రతి ఏడాది ప్రణాళికలు చేపట్టాం. ఉమ్మడి జిల్లాల్లో వలసన్న మాటే లేకుండా చేశాం. రాష్ట్రంలోనే జిల్లాకు ఉపాధి పనుల్లో పెద్దపీట వేశాం. గడిచిన నాలుగేళ్లలో రూ. 2,382.75 కోట్లు కూలీలకే ఖర్చుచేశాం. రూ.1,128.43 కోట్లు మెటీరియల్‌కు వెచ్చించాం. కరోనా లాంటి విపత్తులోనూ ఆదుకున్నాం. చెంతనే ఉపాధి ఉండగా వలస వెళ్లాల్సిన అవసరం ఉండదు.
– వేణుగోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ, అనంతపురం

న్యూస్‌రీల్

గుత్తి, తాడిపత్రిలో పత్తి కొనుగోళ్లు

- క్వింటాకు రూ.7,020 'మద్దతు'



అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్‌లో రైతులు పండించిన పత్తిని కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) క్వింటా రూ.7,020 ప్రకారం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ, మార్కెటింగ్‌శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి తెలిపారు. గురువారం వారు ఏడీఏలు, ఏఓలు, ఆర్‌బీకే అసిస్టెంట్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధ్వర్యంలో తొలుత గుత్తి, తాడిపత్రి మార్కెట్‌యార్డు ప్రాంగణాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అవసరమైతే గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాల్లో కూడా కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఎస్‌పీ కన్నా తక్కువ ధరలు ఉంటే బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవచ్చని రైతులకు సూచించారు. పత్తి పండించిన రైతులు వెంటనే సమీప ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

రెండు స్పెషల్ రైళ్ల రద్దు



కదిరిదేవరపల్లి-తిరుపతి స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు

రాయదుర్గం టౌన్: నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతులు,అభివృద్ధి పనుల కారణంగా నవంబర్ నెలాఖరు వరకూ రాయదుర్గం మీదుగా నడిచే రెండు స్పెషల్ ప్యాసింజర్ రైళ్ల రాకపోకలను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. గుంతకల్లు నుంచి రాయదుర్గం మీదుగా చిక్‌జాజూర్‌కు నడిచే స్పెషల్ ప్యాసింజర్ రైలు (07586/07585), తిరుపతి నుంచి రాయదుర్గం మీదుగా కదిరిదేవరపల్లికి నడిచే స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు (07589) రాకపోకలను నవంబర్ 3 నుంచి 30వ తేదీ వరకూ రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు.


విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



విద్యార్థుల ప్రాజెక్ట్ వర్కులను పరిశీలిస్తున్న డీసీఓ మురళీకృష్ణ

బ్రహ్మసముద్రం: విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని డీసీఓ మురళీకృష్ణ సూచించారు. మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులతో పాటు తరగతి గదులు, ల్యాబ్, లైబ్రరీని పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులపై ప్రిన్సిపాల్ సత్యవతమ్మతో ఆరా తీశారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కేపీఏ టీం సభ్యులు జ్యోతి, రాజేష్ , పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాలు చేయించాలి



గుత్తి మండలం కోట పాఠశాల సైన్స్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న బృంద సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్/గుత్తి: విద్యార్థులతో కొత్త కొత్త ప్రయోగాలు చేయించాలని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు సూచించారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో సైన్స్ లాబ్‌లు, ఐఎఫ్‌పీల వినియోగాన్ని పరిశీలించడానికి వచ్చిన బృందం గురువారం వివిధ స్కూళ్లలో పర్యటించింది. బృందంలోని సభ్యులు జకీర్, రమేష్, వెంకట్‌లు పుట్లూరు, యాడికి, గుత్తి, గుంతకల్లులోని పలు పాఠశాలలు సందర్శించారు. అటల్ టింకరింగ్ ల్యాబ్, స్టెమ్ ల్యాబ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఉపాధ్యాయులకు వాటి వినియోగంపై పలు సూచనలు చేశారు. ఐఎఫ్‌పీ ప్యానెళ్ల బోధన, వినియోగంపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రయోగాలు విద్యార్థులకు అర్థమయ్యేలా చేయించాలని టీచర్లను ఆదేశించారు. శుక్ర, శనివారం కూడా పాఠశాలలను పరిశీలిస్తారని జిల్లా సైన్స్ అధికారి బాలమురళీ తెలియజేశారు. జిల్లా పూర్వపు సైన్స్ అధికారి ఆనంద్ భాస్కర్ రెడ్డి ఉన్నారు.

ప్రజల చెంతకే ప్రత్యేక వైద్యం



అనంతపురంలోని రోటరీ స్కూల్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం మెడికల్: జిల్లాలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. తమ సమీప ప్రాంతాలకే స్పెషలిస్టు వైద్యులు వచ్చి సేవలందిస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గురువారం జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో ఆరోగ్య శాఖాధికారులు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. 2,386 మంది ఓపీ సేవలు వినియోగించుకున్నారు. 40 మంది 'వైఎస్సార్ కంటి వెలుగు' కింద సేవలు పొందారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న 54 మందిని స్పెషలిస్టు వైద్యులు జిల్లా, ఏరియా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు.

నేడు 5 ప్రాంతాల్లో శిబిరాలు..

జిల్లాలో 5 ప్రాంతాల్లో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. కందుకూరు, కనుకూరు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో, అనంతపురంలోని అంబేడ్కర్‌నగర్, నీరుగంటి వీధి, రాయదుర్గంలోని శాంతినగర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలుంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మెరిట్ లిస్ట్ విడుదల

అనంతపురం మెడికల్: ఏపీ వైద్యా విధాన పరిషత్‌లో ఖాళీగా ఉన్న వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారి ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసినట్లు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో, అనంతపురం వెబ్‌సైట్‌లో జాబితా పొందుపరిచినట్లు పేర్కొన్నారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

తాగునీటి అవసరాలకే ప్రాధాన్యం

- కలెక్టర్ గౌతమి



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: 'జిల్లాలో ఈ ఏడాది లోటు వర్షపాతం నమోదైంది. హెచ్‌ఎల్‌సీ, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా వచ్చే నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించాల్సి ఉంది. అధిక నీటి వినియోగ పంటలైన వరి, మొక్కజొన్న, వేరుశనగ, ఉద్యానపంటలు సాగు చేయొద్దు'' అని కలెక్టర్ ఎం.గౌతమి రైతులకు సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ పంట కాలానికి సాధారణ వర్షపాతం 319.7 మిల్లీ మీటర్లు కాగా (22.6 శాతం తక్కువ వర్షపాతం) 247.4 మిల్లీ మీటర్లు నమోదయ్యిందన్నారు. రబీలో ఇప్పటి వరకు 93.7 శాతం లోటు వర్షపాతం నమోదైందన్నారు. 28 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ క్రమంలో తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నీటిని ఎక్కువగా వినియోగించే పంటలను సాగు చేయరాదని కోరారు. బోర్ల కింద కూడా సాగు తగ్గించుకోవాలని చెప్పారు. రైతులు సహకరించాలని, అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోవద్దని కలెక్టర్ గౌతమి సూచించారు.

రీ–సర్వే వేగవంతం చేయాలి

'వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష' కింద జిల్లాలో చేపట్టిన రీ–సర్వే వేగవంతం చేయాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. రీ–సర్వే, రెవెన్యూ తదితర అంశాలపై ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీసీఎల్‌ఏ జి.సాయిప్రసాద్ విజయవాడలోని తన కార్యాలయం నుంచి కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, డీఆర్‌ఓ గాయత్రిదేవి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రీ-సర్వేపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో రీ-సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మూడో విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో రీ–సర్వే వేగవంతం చేయాలన్నారు. ఈ క్రమంలో ప్రతి ప్రక్రియ నాణ్యతగా నిర్వహిస్తూ గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో సర్వే, భూ రికార్డుల శాఖ ఏడీ రూప్లా నాయక్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు మండలం పంపనూరులో సచివాలయాలన్ని పరిశీలిస్తున్న సీఈ కృష్ణారెడ్డి

వారిని సస్పెండ్ చేయండి

అనంతపురం సిటీ: గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాల పురోగతిలో వెనుకబడిన ఉరవకొండ, కళ్యాణదుర్గం, రాయదుర్గం డివిజనల్ ఇంజినీర్లు (డీఈఈలు), అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈఈలు) సహా సచివాలయాల్లో పని చేసే ఇంజినీరింగ్ సహాయకులపై కలెక్టర్ గౌతమి సీరియస్ అయ్యారు. సంబంధిత అధికారులతో గురువారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్య సాధనలో వెనుకబడిన వారిని సస్పెండ్ చేయాలని పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్‌ను ఆదేశించారు.

సీఈ క్షేత్రస్థాయి పర్యటన

పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ (సీఈ) కృష్ణారెడ్డి కూడా గురువారం జిల్లాలో పర్యటించారు. ఆత్మకూరు మండలం పంపనూరు, కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి, రాయదుర్గం నియోజకవర్గంలోని గుమ్మఘట్ట మండలం మారంపల్లిలో నిర్మాణంలో ఉన్న గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను పీఆర్ ఎస్‌ఈ భాగ్యరాజ్‌తో కలసి పరిశీలించారు. లక్ష్య సాధనలో వెనుకబడి ఉండడంతో సీఈ కృష్ణారెడ్డి సీరియస్ అయ్యారు. డీఈఈలు రాజన్న (కళ్యాణదుర్గం), రామ్మోహన్‌రెడ్డి (రాయదుర్గం)తో పాటు ఏఈఈలు పార్థసారథి (ఆత్మకూరు), కిశోర్‌కుమార్ (కళ్యాణదుర్గం), లక్ష్మీనారాయణ (గుమ్మఘట్ట)పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయా గ్రామ సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లపైనా ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఈ భాగ్యరాజ్‌ను ఆదేశించారు.

7న పుట్టపర్తికి సీఎం జగన్




ముఖ్యమంత్రి పర్యటనపై సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్ అరుణ్‌బాబు
- విజయవంతానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశం

పుట్టపర్తి అర్బన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 7వ తేదీన పుట్టపర్తికి విచ్చేయనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన ఎస్పీ మాధవరెడ్డి, జేసీ చేతన్, పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్, డీఆర్‌ఓ కొండయ్యతో కలిసి ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈనెల 7న పుట్టపర్తి సభ నుంచే 'వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్' పథకం నిధులను రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులకు సీఎం విడుదల చేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... సీఎం ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారని, అక్కడి నుంచి బహిరంగ సభకు వెళ్తారన్నారు. అందువల్ల విమానాశ్రయం నుంచి వై జంక్షన్ మీదుగా ప్రైవేట్ క్రికెట్ మైదానం, పోలీస్ పరేడ్ గ్రౌండ్ వరకూ రహదారుల వెంట బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటన పాస్‌ల జారీ పుట్టపర్తి ఆర్డీఓ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కాన్వాయ్‌కు సంబంధించిన వివరాలు రవాణాశాఖ అధికారి, శానిటేషన్, తాగునీటి సౌకర్యం ఏర్పాట్లను మున్సిపల్ అధికారులు చేయాలన్నారు. అంబులెన్స్‌లు, వైద్య శిబిరాల ఏర్పాట్లు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చూసుకోవాలన్నారు. సీఎం బహిరంగ సభ కోసం శుక్రవారం వైజంక్షన్‌లోని మైదానాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సభకు రైతు భరోసా లబ్ధిదారులతో పాటు ప్రజలు భారీగా తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలోఆర్డీఓ భాగ్యరేఖ, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ కృష్ణారెడ్డి, డీసీహెచ్‌ఎస్ తిప్పేంద్రనాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి చాంద్‌బాషా, సెరికల్చర్ జేడీ పద్మమ్మ, జిల్లా ఉద్యానశాఖ అధికారి సుదర్శన్, డీపీఓ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ పీడీ లక్ష్మీకుమారి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ అధికారి కరుణసాగర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు అభ్యసన సామర్థ్య పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను గుర్తించేందుకు ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు శుక్రవారం పరీక్షలు (సర్వే) నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎన్‌ఎస్‌ఎస్) పేరుతో దేశ వ్యాప్తంగా ఒకేమారు ఈ పరీక్ష నిర్వహిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ అచీవ్‌మెంట్ ఎడ్యుకేషనల్ అసెస్‌మెంట్ సర్వే (ఎస్‌ఈఏఎస్) చేపడుతోంది. జిల్లాలో 1,236 స్కూళ్ల నుంచి 33,937 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఓఎంఆర్ విధానంలో పరీక్ష ఉంటుంది. 3,6 తరగతుల విద్యార్థులకు తెలుగు/ ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానం, 9వ తరగతికి తెలుగు/ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్టులపై పరీక్ష నిర్వహిస్తారు. 3వ తరగతి విద్యార్థులకు మూడో తరగతి సిలబస్‌పై, 6వ తరగతికి ఐదో తరగతి సిలబస్, 9వ తరగతి విద్యార్థులకు 8వ తరగతి సిలబస్‌పై పరీక్ష నిర్వహిస్తారు. 3, 6 తరగతుల విద్యార్థులు 40 ప్రశ్నలు 60 నిమిషాల్లో రాయాలి. 9వ తరగతి విద్యార్థులు 60 ప్రశ్నలకు 90 నిమిషాల్లో పరీక్ష రాయాలి.



ఏర్పాట్లు పూర్తి

జిల్లాలో పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇన్విజిలేటర్లుగా టీచర్లు కాకుండా డిగ్రీ, పీజీ, డైట్, ఇంజినీరింగ్ విద్యార్థులు వ్యవహరిస్తారు. మొత్తం 1236 మందిని ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా నియమించారు. ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున 62 మందిని బ్లాక్ లెవెల్ కోఆర్డినేటర్లుగా నియమించారు. ఉదయం 10.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుంది. గదిలో సరైన వెంటిలేషన్, వెలుతురు, తాగునీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని డీఈఓ నాగరాజు ఆదేశించారు. ఇన్‌స్టిట్యూట్ హెడ్, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ ఇద్దరూ పాఠశాల/తరగతిలో మొత్తం సర్వేకు బాధ్యత వహిస్తారని పేర్కొన్నారు.

ఆత్మశాంతికి అశ్రు నివాళి

చనిపోయిన తమ కుటుంబ సభ్యుల ఆత్మలకు శాంతి కలగాలని జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులు సమస్త పరిశుద్ధ ఆత్మల పండుగను గురువారం నిర్వహించారు. సమాధుల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చనిపోయిన తమవారిని గుర్తు చేసుకొని నివాళులర్పించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం





అనంతపురం నగరంలోని సమాధుల తోటలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు, (ఇన్‌సెట్) సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబసభ్యులు

క్లుప్తంగా

ఫైలేరియా వ్యాధి నిర్ధారణపై డ్రైవ్



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి ఓబులు

అనంతపురం మెడికల్: ఫైలేరియా వ్యాధి నిర్ధారణకు సంబంధించి చేపట్టే డ్రైవ్‌ను విజయవంతం చేయాలని జిల్లా మలేరియా అధికారి ఓబులు పేర్కొన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణపై మలేరియా సబ్ యూనిట్ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఓబులు మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ ప్రకారం బ్లాకుల వారీగా రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సహకారంతో రక్తపూతలు సేకరించి ల్యాబ్‌కు పంపించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 42 గ్రామాల్లో రక్తపూతల సేకరించి పరీక్షిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, లక్ష్మీనాయక్, ఆరోగ్య విస్తరణ అధికారి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



మృతురాలు తులశమ్మ

పుట్లూరు: మండలంలోని సూరేపల్లికి చెందిన తులశమ్మ (38) అనే వివాహిత గురువారం విషపు గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల వివరాలమేరకు... తులశమ్మ కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతోందన్నారు. వివిధ ఆస్పత్రుల్లో వైద్యం చేయించినా కడుపునొప్పి తగ్గకపోవడంతో విషపు గుళికలు మింగిందన్నారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు చెప్పారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి భర్త రామాంజినేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ హనుమంతు తెలిపారు.

వాచ్‌మెన్ హత్య



మృతుడు బంగి నారాయణ

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద ఉన్న ఓ వెంచర్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న రామచంద్రాపురం బంగి నారాయణ (65)ను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలపై కర్రతో బాది హత్య చేశారు. పోలీసుల వివరాలమేరకు.. గురువారం ఓ వెంచర్లోకి పనికి వెళ్లిన కూలీలు వాచ్‌మెన్ బంగి నారాయణ మంచంపై రక్తపు గాయాలతో పడి ఉండడాన్ని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. విషయం పోలీసులకు తెలియడంతో ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ సత్యనారాయణలు డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. హత్యకు ఉపయోగించిన కర్రను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు, హత్య చేసిన వారు కర్రపై తమ వేలి ముద్రలు పడకుండా టవాల్ చుట్టి జాగ్రత్త పడ్డారు. పోలీసులు పక్కనే ఉన్న మరికొన్ని వెంచర్ల వాచ్‌మెన్లతో, అక్కడ పని చేసే వారితో విచారించారు. మృతుడు పెద్ద కుమారుడు సుబ్బరాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'వ్యాయామ విద్య'కు పెద్దపీట

- అన్ని ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా పరికరాలు
- రూ. కోటి 16 లక్షలు ఖర్చు చేసిన ప్రభుత్వం
- ప్రాథమిక పాఠశాలలకు 9, యూపీ పాఠశాలలకు 15, ఉన్నత పాఠశాలలకు 17 రకాల వస్తువులు
- తొలిసారి పీడీ, పీఈటీలకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు



ఉన్నత పాఠశాలకు సరఫరా చేసే క్రీడా వస్తువులు

అనంతపురం ఎడ్యుకేషన్: పాఠశాలల్లో క్రీడలు, వ్యాయమ విద్యకు ప్రభుత్వం పెద్ద పీట వేసింది. ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను కూడా ఒక సబ్జెక్టుగా పరిగణించాలని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందులో భాగంగానే ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు క్రీడా సామగ్రి సరఫరా చేసి క్రీడలను ప్రోత్సహిస్తోంది. గతంలో క్రీడా పరికరాల కోసం తూతూ మంత్రంగా ఏటా రూ. 500 నుంచి రూ.1000 దాకా మంజూరు చేసేవారు. ఇప్పుడు వేలాది రూపాయలు ఖర్చు చేసి నాణ్యమైన క్రీడా సామగ్రిని సరఫరా చేసింది.

సరఫరా చేస్తున్న క్రీడా పరికరాలివే..

- ప్రాథమిక పాఠశాలలకు...

ఉడెన్ క్రికెట్ బ్యాట్, వికెట్స్ సెట్, టెన్నిస్ బాల్, వాలీబాల్, హ్యాండ్‌బాల్, ఫ్రిస్బీ, మల్టీ కలర్ హులా హూప్స్, స్టెప్ హార్డిల్స్, స్కిప్పింగ్ రోప్

- ప్రాథమికోన్నత పాఠశాలలకు..

వాలీబాల్, త్రోబాల్స్, టన్నీకాయిట్, బాస్కెట్ బాల్, టెన్నికాయిట్ రింగ్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, చెస్ సెట్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ రబ్బర్, కోన్స్‌మార్కలగ్, స్టెప్ హార్డిస్, ఫ్రిస్బీ

- ఉన్నత పాఠశాలలకు...

వాలీబాల్స్, వాలీ నెట్, త్రోబాల్స్, త్రోబాల్ నెట్, హ్యాండ్‌బాల్స్, టెన్నికాయిట్స్, టెన్నికాయిట్ నెట్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్స్, చెస్‌సెట్, ఫుట్ ఎయిర్ పంప్, ఫుట్‌బాల్, వేయింగ్ మిషన్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, మెజరింగ్ టేప్, యోగా మ్యాప్, ఫుట్ పంప్.

పరికరాల కోసం రూ. కోటికిపైగా ఖర్చు

ప్రాథమిక పాఠశాలలకు సరఫరా చేసే క్రీడా పరికరాల కోసం ఒక్కో పాఠశాలకు రూ. 3,400, ఒక్కో ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.7,800, ఒక్కో ఉన్నత పాఠశాలకు రూ. 17,700 ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 1179 ప్రాథమిక పాఠశాలలు, 195 ప్రాథమికోన్నత పాఠశాలలు, 346 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటికీ కలిపి రూ. 116 లక్షలా 63 వేల 800 ఖర్చు చేశారు.

తొలిసారి పీడీ, పీఈటీలకు సమావేశాలు

విద్యా వ్యవస్థలో తొలిసారి పీడీ, పీఈటీలకు స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి కేవలం సబ్జెక్టు టీచర్లకు మాత్రమే కాంప్లెక్స్‌లు ఉండేవి. ఈసారి పీడీ , పీఈటీలకు కూడా కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ కేంద్రంగా ఒక కాంప్లెక్స్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గత నెలలో పీడీ, పీఈటీలకు కూడా కాంప్లెక్స్ సమావేశాలు జరిగాయి. వ్యాయామ విద్యకు పెద్దపీట వేసి తమకు శిక్షణ ఇవ్వడం శుభసూచికమని పీడీలు, పీఈటీలు చెబుతున్నారు.

ఎన్నడూ లేనివిధంగా క్రీడా సామగ్రి



గతంలో ఎప్పుడూ లేని విధంగా విద్యార్థులను క్రీడల వైపు పోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా సామగ్రి సరఫరా చేసింది. ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలు పంపిణీ చేసిన ప్రభుత్వానికి పీడీలు, పీఈటీల తరుపున కృతజ్ఞతలు. రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే విద్యార్థులకు రవాణా ఖర్చుల కోసం కొంత మొత్తం అందజేయడం సంతోషకరం.

– కె.నరసింహారెడ్డి, పీడీ అసోసియేషన్ నాయకుడు

పరికరాలు నాణ్యతగా ఉన్నాయి



విద్యార్థుల కోసం సరఫరా చేసిన క్రీడా పరికరాలు చాలా నాణ్యతగా ఉన్నాయి. నేరుగా రాష్ట్ర అధికారులు మండలాలకు సరఫరా చేశారు. ఎంఈఓల కార్యాలయాల్లో భద్రపరిచారు. అక్కడి నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తాం. పీడీ, పీఈటీలకు కూడా ఎప్పుడూ లేని విధంగా స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేశాం. గత నెలలో శిక్షణ కూడా ఇచ్చారు.

– ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి అకడమిక్ మానటరింగ్ అధికారి, సమగ్రశిక్ష

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం



ఇందు (ఫైల్)

పుట్లూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో ఇంటర్ విద్యార్థిని అదృశ్యం కలకలం రేపుతోంది. వివరాలు ఇలా ఉన్నాయి. తాడిపత్రి మండలం పెద్ద పొలమడ గ్రామానికి చెందిన వెంకటరమణ, హేమలత దంపతుల కుమార్తె ఇందు (17) పుట్లూరు కేజీబీవీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం 5.45 గంటల సమయంలో ఇందు పరారైనట్లు కేజీబీవీ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఎంఈఓ శ్రీదేవి, జీసీడీఓ మహేశ్వరితో పాటు స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో వారు పాఠశాలకు చేరుకొని విచారణ చేపట్టారు. అయితే పాఠశాల గేట్లు తెరవకుండా విద్యార్థిని బయటకు ఎలా వెళ్లింది? చదువుపై ఇష్టం లేక వెళ్లిందా? ఇతర కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. మిస్సింగ్ అయిన విద్యార్థి ఇంటికి రాలేదని తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. కేజీబీవీతో పాటు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తున్నారు. విద్యార్థిని తండ్రి వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ హనుమంతు తెలిపారు.

రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి సెమిస్టర్, బీఎస్సీ ఐదో సెమిస్టర్, బీకాం ఆరో సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను గురువారం విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ జీవీ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాలు జ్ఞానభూమి పోర్టల్‌లోనూ అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.

పల్లె బాట.. ప్రగతి మాట

- ఉమ్మడి అనంత జిల్లాలో రూ.50.4 కోట్లతో 14 రోడ్ల నిర్మాణానికి అనుమతి
- 69.3 కిలోమీటర్ల మేర పూర్తిగా అభివృద్ధి చెందనున్న రోడ్లు
- టెండర్ల ద్వారా పనుల కేటాయింపు

అనంతపురం సిటీ: గ్రామీణ ప్రాంత రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. అత్యంత ప్రాధాన్యత కింద ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 14 రహదారుల నిర్మాణాలకు, పాడైన రహదారులు.. వంతెనల మరమ్మతులకు అనుమతులు మంజూరు చేసింది. మొత్తం 69.3 కిలోమీటర్ల మేర రహదారులను రూ.50.4 కోట్ల వ్యయంతో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయనున్నారు. ఇందులో అనంతపురం జిల్లాలో తొమ్మిది రహదారులకు రూ.41 కోట్లు, శ్రీసత్యసాయి జిల్లాలో ఐదు రోడ్లకు రూ.9.40 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

టెండర్ల ద్వారా పనుల అప్పగింత

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రోడ్లు, వంతెనల నిర్మాణ పనులకు సంబంధించి టెండర్లు ఆహ్వానించాం. ఈ ప్రక్రియ పూర్తికాగానే పనులు కేటాయిస్తాం. రహదారులు, వంతెన నిర్మాణాలను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తోంది.

– యమ్మాని భాగ్యరాజ్, సూపరింటెండెంట్ ఇంజినీర్, పీఆర్, అనంతపురం సర్కిల్

నియోజకవర్గాల వారీగా మంజూరైన నిధులు ఇలా..

నియోజకవర్గం	రోడ్డు పేరు	కి.మీ.	కేటాయించిన మొత్తం
శింగనమల	శింగనమలలో అంతర్గత రహదారులు	0.74	రూ. కోటి
కళ్యాణదుర్గం	కన్నేపల్లి - యాటకల్లు వయా నాగిరెడ్డిపల్లి, బ్రహ్మసముద్రం	21.49	రూ.13 కోట్లు
గుంతకల్లు	పామిడిలో సీసీ రోడ్లు	5.60	రూ.5 కోట్లు
రాయదుర్గం	బాదన్‌హాళ్ - గొడిసేపల్లి బీటీ రోడ్డు	2.93	రూ.80 లక్షలు
రాయదుర్గం	వేదవతి రిజర్వాయర్‌పై వంతెన	0.30	రూ.6 కోట్లు
ఉరవకొండ	గుంతకల్లు- ఉరవకొండ (పందికుంట క్రాస్ వరకు)	4.97	రూ.1.85 కోట్లు
ఉరవకొండ	కూడేరు-మరుట్ల-3 కాలనీ వరకు	12.80	రూ.6.40 కోట్లు
కళ్యాణదుర్గం	కన్నేపల్లి- భూపసముద్రం	0.17	రూ.30 కోట్లు
తాడిపత్రి	చిట్టూరు-తరిమెల	2.36	రూ.5 కోట్లు
ధర్మవరం	జొన్నలకొత్తపల్లి తండా అప్రోచ్ రోడ్డు	2.00	రూ.1.05 కోట్లు
పెనుకొండ	చంద్రగిరి - వెంకటగిరి పాళ్యం రోడ్డు	1.00	రూ. 70 లక్షలు
రాప్తాడు	ఆర్అండ్‌బీ రోడ్డు - సుద్దకుంటపల్లి రోడ్డు	3.00	రూ.1.60 కోట్లు
రాప్తాడు	పీఆర్ కొట్టాల అప్రోచ్ రోడ్డు	6.60	రూ.3 కోట్లు
పుట్టపర్తి	వెంగళమ్మ చెరువు - నార్సింపల్లి తండా	5.34	రూ. 2.60 కోట్లు

వాస్తవాలు తెలుసుకోకుండా దుష్ప్రచారం



శ్రావణి, వారి కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడుతున్న విప్ కాపు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి
- జగనన్న మేలును మరువలేమన్న శ్రావణి

రాయదుర్గం: పేదింటి బిడ్డ శ్రావణిని ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్ ఆదుకున్న విషయాన్ని అసెంబ్లీలో చర్చిస్తే దాన్ని టీడీపీ నాయకులు వక్రీకరిస్తూ సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేయడంపై ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. వాస్తవాలు తెలుసుకోకుండా పచ్చ ద్రోహులు కొందరు అత్యుత్సాహం చూపేలా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని రోడ్లు, భవనాలశాఖ అతిథి గృహంలో శ్రావణి, వారి కుటుంబ సభ్యులతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడారు. డీ హీరేహాళ్ మండలం జాజరకల్లుకు చెందిన లక్ష్మి, జీ రామిరెడ్డిల కుమార్తె శ్రావణి ప్రస్తుతం ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోందన్నారు. వారి స్వగ్రామంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమానికి హాజరైనట్లు చెప్పారు. ఆ సమయంలో శ్రావణికి ఉన్న చెవిటి, మూగ సమస్య తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స చేయాలని సంబంధిత అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. సుమారు రూ.10 లక్షల వ్యయంతో హైదరాబాద్ అపోలా ఆస్పత్రిలో రెండేళ్ల క్రితం శస్త్ర చికిత్సలు జరిపారన్నారు. 15 ఏళ్లుగా మూగ, చెవిటితో బాధపడిన శ్రావణిని రాష్ట్ర ప్రభుత్వం మామూలు మనిషిగా తయారు చేసిందని వెల్లడించారు. శుభకార్యానికి వెళ్లినప్పుడు ఆ అమ్మాయి బాగున్నారా సార్.. మీకు, సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం అని చెప్పిందన్నారు. శ్రావణి లాంటి వారికెందరికో రాష్ట్ర ప్రభుత్వం మేలు చేకూర్చిన విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించినట్లు చెప్పారు. దాన్ని కూడా ట్రోల్ చేస్తుండటం హేయమైన చర్యన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

అమ్మ, నాన్న జన్మనిస్తే సీఎం జగన్ పునర్జన్మనిచ్చాడని శ్రావణి తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్స చేయించకపోతే చెవిటి, మూగ దానిలానే జీవితం చాలించాల్సి వచ్చేదన్నారు. మంచిచేసే ప్రభుత్వాన్ని ప్రోత్సహించాల్సిందిపోయి తప్పుపట్టేలా మాట్లాడడం పద్ధతి కాదని శ్రావణి తల్లి లక్ష్మి అన్నారు. మా బిడ్డకు చేసిన మేలు తమకు మాత్రమే తెలుసని, రాజకీయ స్వార్థం కోసం మాట్లాడే వెదవలకు ఏం అర్థమవుతుందని మండిపడ్డారు.

ఉద్యోగావకాశాలు చేజార్చుకోవద్దు



మాట్లాడుతున్న డీఎల్‌డీఓ ఓబులమ్మ

అనంతపురం సిటీ: ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా మరణించిన ఉద్యోగులకు సంబంధించి 106 మంది వారసులు ఉన్నారు. అయితే జూనియర్ అసిస్టెంట్ పోస్టులు కేవలం ఆరు మాత్రమే ఉండగా, కార్యాలయ సబార్డినేట్ పోస్టులు 180 వరకు ఉన్నాయి. జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు 48 మంది అర్హులు ఉన్నారు. అయితే అందరూ తమకు జూనియర్ అసిస్టెంట్ పోస్టులే కావాలంటూ పట్టుబడుతున్న నేపథ్యంలో కలెక్టర్ ఎం.గౌతమి, జాయింట్ కలెక్టర్/జెడ్పీ ఇన్‌చార్జ్ సీఈఓ కేతన్‌గార్గ్ ఆదేశాల మేరకు వారందరినీ గురువారం జెడ్పీకి పిలిపించారు. జెడ్పీ కార్యాలయ సమావేశ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారిణి (డీఎల్‌డీఓ) ఓబుళమ్మ మాట్లాడారు. కారుణ్య నియామకాలలో జరుగుతున్న జాప్యానికి వారసులే కారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ జూనియర్ అసిస్టెంట్ పోస్టే కావాలంటూ పట్టుబడుతున్నారని తెలిపారు. ఇలాగైతే ఏడు, ఎనిమిది సంవత్సరాలు నిరీక్షించాల్సి ఉంటుందని, అప్పటి వరకు ఎలాంటి జీతం ఉండదన్నారు. అదే సబార్డినేట్ ఉద్యోగంలో చేరితే నాలుగైదేళ్లలో జూనియర్ అసిస్టెంట్‌లుగా పదోన్నతి పొందుతారని చెప్పారు. అప్పటి వరకు ప్రతి నెలా కనీసం రూ.30 వేలకు పైబడి జీతం వస్తుందని, ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కవచ్చన్నారు. కోరుకున్న ఉద్యోగమే కావాలంటే మాత్రం ఇప్పట్లో సాధ్యం కాదని, వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోవద్దని సూచించారు.

అంకిత భావంతో పని చేయండి



స్టాఫ్‌నర్సుకు నియామక పత్రం అందజేస్తున్న డీఎంహెచ్ఓ భ్రమరాంబ దేవి

అనంతపురం మెడికల్: అంకిత భావంతో పనిచేసి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి స్టాఫ్ నర్సులకు సూచించారు. జిల్లాలో వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని 29 స్టాఫ్ నర్స్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

కళ్యాణదుర్గం: ఐచర్ వాహనంలో అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని కళ్యాణదుర్గం పట్టణంలోని టీ సర్కిల్‌లో విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. గురువారం ఉదయం పక్కా సమాచారంతో విజిలెన్స్ అధికారులు ఎస్ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఈఈఈఈ రాజశేఖర్‌లు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి ఐచర్ (ఏపీ02టీఏ7739) వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో 147.50 క్వింటాళ్ల (330 బ్యాగులు) రేషన్ బియ్యం అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. ఐచర్ వాహనంతో పాటు బియ్యంను సీజ్ చేశారు. మధుబాబు, రాజశేఖర్, యజమాని నాగభూషణరెడ్డిపై కళ్యాణదుర్గం పట్టణ పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీటీపీ కాలువ నిర్మాణ ప్రక్రియ వేగవంతం



రైతులతో సమావేశమైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి

బెళుగుప్ప: జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీ ప్రాజెక్టుకు నీటిని తీసుకెళ్లే హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ పంపుహౌస్‌ల నిర్మాణ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసిందని హంద్రీనీవా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి తెలిపారు. గురువారం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీ కాలువ వెళ్లే దుద్దేకుంట, గంగవరం, కోనంపల్లి గ్రామాల రైతులతో పంపుహౌస్‌ల నిర్మాణ పనులకు సంబంధించి భూసేకరణ ధర నిర్ణయంపై సమావేశమయ్యారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవిన్యూ, హంద్రీనీవా అధికారులతో కలసి రైతులతో మాట్లాడారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి బీటీపీ ప్రాజెక్టు వరకు మొత్తం 14 పంపుహౌస్‌లను నిర్మించనున్నట్లు చెప్పారు. ఇందులో బెళుగుప్ప మండలంలో దుద్దేకుంట సమీపంలో రెండు, గంగవరం, కోనంపల్లి గ్రామాల వద్ద ఒకటి చొప్పున పంపుహౌస్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 26.61 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు తెలిపారు. సేల్ డీడ్‌ల ఆధారంగా రూ.5.5 లక్షల వరకు ఉండగా.. మార్కెట్ విలువ ప్రకారం రూ.8 లక్షల వరకు చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. మార్కెట్‌లో ఎకరా రూ.15 లక్షలు ఉందని, తమకు రూ.14 లక్షలు చొప్పున ఎకరానికి పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు. రైతుల వినతులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు.

నెట్‌బాల్, తైక్వాండో జట్ల ఎంపిక



అంతర జిల్లా పోటీల్లో ప్రాతినిధ్యం వహించే అనంతపురం జిల్లా జట్టు

అనంతపురం: స్కూల్ గేమ్స్ సెలక్షన్స్‌లో భాగంగా నెట్‌బాల్ అండర్-14 , అండర్-17 అంతర జిల్లా జట్టులో ప్రాతినిధ్యం వహించే బాల, బాలిక జట్లను గురువారం ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ బి. సుగుణమ్మ, శ్రీసత్యసాయి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ అంజన్న, జిల్లా కోఆర్డినేటర్ ఎల్. నాగరాజు పాల్గొన్నారు.

నెట్‌బాల్ బాలుర జట్టు

శశిధర్, సంతోష్, అఖిల్, వినయ్‌కుమార్, సందీప్ రావు, శశాంక్, కరుణ దేవరాజ్, శ్రీకాంత్, రూపేష్, బాబా, మహబూబ్, ప్రవీణ్.

నెట్‌బాల్ బాలికల జట్టు

మనుష, దీపిక, క్రాంతి, సృజన, అమల, మధులత, కుమారి, నవ్య, చరిత, హారిక, గీత, గీతారెడ్డి

తైక్వాండో అండర్-14కు ఎంపికైన బాలికలు

సృజన, జ్ఞానశ్రీ, గాత్ర, సింధు, తితిక్ష, ముహారిక, దృశ్యన , దిల్షాద్.

తైక్వాండో అండర్-17 ఎంపికైన బాలికలు

సిరివలి, భార్గవి, యశస్విని, కరిష్మా, కృష్ణ కీర్తన, ఐజ, పూజిత, హరిత, నాగ మౌనిష, మౌనిక, అఫ్రీన్, యోగ చర్విత.


మాదక ద్రవ్యాలతో అనర్థం



మాట్లాడుతున్న సెబ్ రాష్ట్ర జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి

గుంతకల్లు రూరల్: మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై యువత అవగాహన కలిగి ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రాష్ట్ర జాయింట్ కమిషనర్ నాగలక్ష్మి విద్యార్థులకు సూచించారు. గురువారం స్థానిక ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు బుద్ధిగా చదువుకొని భవిష్యత్తులో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మయ్య, సెబ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవుల జాతర



ఆవుల జాతర నిర్వహిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పలకుంటలో ఆవుల జాతర ఉత్సవాన్ని యాదవ కులస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ సమీపంలో ఉన్న ఆవుల గూడు వద్దకు యాదవ కులస్తులు ఊరేగింపుగా వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆవులు , పశువులను భక్తులు ఆవుల గూడు చుట్టూ ప్రదక్షిణ చేయించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

క్లుప్తంగా

శరవేగంగా పైపులైన్ మరమ్మతు


పైప్‌లైన్ పనులు చేయిస్తున్న సర్పంచ్

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలో మూడు రోజులుగా పైపులైన్ మరమ్మతుకు గురవుతోంది. దీంతో ప్రజలకు ఎలాంటి నీటి సమస్య తలెత్తకూడదని సర్పంచ్ లక్ష్మీనారాయ ణరెడ్డి శరవేగంగా పైప్‌లైన్ మరమ్మతులు చేయించారు. సమస్య ఎక్కువగా ఉండటంతో జేసీబీతో చేయించి, ప్రజలకు నీటి సమస్యరా కుండా చూశారు.

నేడు సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలి పారు. అధికారులు, మండలంలోని ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలన్నారు.

షిర్డీసాయి బాబా మందిరానికి వైకుంఠ రథం


షిర్డీసాయిబాబా మందిరానికి వైకుంఠ రథాన్ని అందిస్తున్న లక్ష్మీరెడ్డి

అనంతపురం కల్చరల్: నగరంలోని ప్రజలకు అందుబాటులో ఉండేలా వైకుంఠ రథాన్ని కోఆప్షన్ మెంబర్ లక్ష్మీరెడ్డి అందించారు. గురువారం మూడోరోడ్డులోని షిర్డీ సాయిబా బా మందిరానికి ఆయన రూ.5 లక్షలు విలువ చేసే వైకుంఠ రథాన్ని కేటాయిం చినట్లు ఆలయ కమిటీ సభ్యులు జయచంద్ర చౌదరి, ఆనంద్, గంగిరెడ్డి తెలిపారు. గతం లోనూ ఆయన ఒక వాహనాన్ని అం త్యక్రియల కోసం అందించారని, ప్రస్తుత అవసరాల దృష్ట్యా మరో వాహనం కూడా అందించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనం తరం లక్ష్మీరెడ్డి దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు సుం దరేశం, నలబోలు శ్రీలక్ష్మి, శశి, లక్ష్మీదేవి, రఘునాథ్, సతీష్, శ్రీనివాసులు, లక్ష్మీనర సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీ రెడ్డి మాట్లాడుతూ వైకుంఠ రథం అందరికీ అందుబాటులో ఉంటుందని, అవసరమై నవారు 9440757151, 8885375790 నం బర్లలో సంప్రదించాలన్నారు.

అర్బన్ తహసీల్దార్‌గా బాలకిషన్ బాధ్యతల స్వీకరణ



అనంతపురం రూరల్: అనంత పురం అర్బన్ తహసీల్దార్ బాలకిషన్ గురు వారం బాధ్యతలు స్వీకరించారు.రూరల్ తహ సీల్దార్‌గా విజయలక్ష్మి, అర్బన్‌కు బ్రహ్మస ముద్రం తహసీల్దార్‌గా పని చేస్తున్న బాలకిష న్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. తహసీల్దార్ మాట్లా డుతూ సిబ్బంది సహకారంతో ప్రజల సమ స్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నిత్యావసరాల పంపిణీ

అనంతపురం కల్చరల్: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన ముగ్గురు చిన్నారులు కవిత, కల్యాణి, కల్యాణ్‌లకు, జాలీబాయి అనే వృద్ధురాలి వద్ద ఉంటున్న మహేంద్రనాయక్, మనోజ్ నాయక్‌కు నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిత్యావసర వస్తువులు గురువారం అందించారు. ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మల మురళీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా షష్టిపూర్తి మహోత్సవం


షష్టిపూర్తి వేడుకలో పాల్గొన్న 108 మంది దంపతులు

అనంతపురం కల్చరల్: గుత్తిరోడ్డులోని బళ్లా కన్వెన్షన్ హాలులో 108 జంటలకు షష్టిపూర్తి కార్యక్రమాలు, దేవతామూర్తులకు కల్యాణో త్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. శృంగేరీ భారతీతీర్థ పీఠం పరమహంస పరి వ్రాజకాచార్యులు భారతీ నృసింహ తీర్థ ఆనంద స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో రుత్వి కులు షష్టిపూర్తి కార్యక్రమాన్ని, కల్యాణోత్స వాలు సంప్రదాయరీతిలో జరిపించారు. ఉదయం గోపూజలు, గణపతిహోమం, రుద్రాభిషేకం అనంతరం పద్మావతి సమేత వేంకటేశ్వర కల్యాణం, సీతారాముల కల్యా ణం, శివపార్వతుల కల్యాణ ఘట్టాలు శాస్త్రో క్తంగా జరిపించారు. కార్యక్రమంలో ఏపీ ఎం డోమెంట్ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్, విజిలెన్సు ఎస్పీ మునిరామయ్య, ఎల్కేపీ కార్యదర్శి పద్మజ, సీనియర్ నటుడు సోమిరెడ్డి, సాయి ట్రస్టు అధినేత విజయ్‌కు మార్, వేదపండితులు దేవరకొండ బాలాజీ, శర్మ, గిరిప్రసాద్ శర్మ, సురేష్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అబ్బే..అడిగేదెవరు?

అడ్డదిడ్డంగా భవనాలు నిర్మించేద్దాం

- నగరంలో అడ్డుఅదుపూ లేకుండా అక్రమ నిర్మాణాలు
- వంద దాటిన చార్జ్‌షీట్లు
- రూ.కోట్లలో అపరాధ రుసుం

అనంతపురం కార్పొరేషన్: నగర పరిధిలో భవ నాలు నిర్మించాలంటే నగరపాలక సంస్థ అధికా రుల అనుమతి తప్పనిసరి. నిబంధనలకనుగు ణంగా నిర్మాణాలు చేపట్టాలి. అయితే నగరంలో భవన నిర్మాణదారులు అడ్డగోలుగా నిర్మించేస్తు న్నారు. నగరపాలక సంస్థ అధికారులు చార్జ్‌షీ ట్లు దాఖలు చేస్తున్నా, భవన నిర్మాణదారులు, లైసెన్స్ ఇంజినీర్లు పట్టించుకోలేదు. రూ.లక్షల్లో అపరాధ రుసుం వేస్తున్నా అవేం పట్టించుకోకుం డా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్మాణదారులకు నోటీ సులు ఇచ్చారు.

నగర పరిధిలో వంద చార్జ్‌షీట్లు:

- నగరంలోని రాంనగర్ రిజిస్ట్రేషన్ కార్యా లయం సమీపంలో ఓ నిర్మాణదారుడు నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు నిర్మాణం చేపట్టగా నగరపాలక సంస్థ అధి కారులు రూ.1.5 కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని చార్జ్‌షీట్ దాఖలు చేశారు.
- కమలానగర్ శ్రీ సాయి డిగ్రీ కళాశాల సమీపంలో అదనపు ఫ్లోర్, కాలువకు ఆనుకొని నిర్మాణం, ఎలాంటి సెట్‌బాక్స్ వేయకుండా నిర్మిస్తున్న ఓ భవనానికి రూ.35 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు అపరాధ రుసుం చెల్లించాలని చార్జ్‌షీట్ దాఖలు చేశారు.
- ఆదర్శనగర్‌లో స్టిల్ట్, జీప్లస్ 3 భవనానికి అనుమతి తీసుకున్న నిర్మాణదారుడు..అ దనపు ఫ్లోర్, పెంట్ హౌస్ ఏర్పాటు చేయగా, రూ.19 లక్షలు అపరాధ రుసుం వేశారు.
- ఇలా నగరంలోని ఆదర్శనగర్, కమలాన గర్, హౌసింగ్ బోర్డు, సాయినగర్, సంగమే శ్వర సర్కిల్, కోర్టు రోడ్డు, శ్రీనగర్ కాలనీ, మారుతీనగర్, శారదనగర్, వేణుగోపాల్‌న గర్, తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో భవనాలను చార్జ్‌షీట్లు దాఖలు చేసినా, నిర్మాణదారులు, లైసెన్స్ ఇంజినీర్లు డోంట్ కేర్ అంటున్నారు.

అధికారుల ప్రేక్షకపాత్ర:

ప్రారంభదశలోనే భవనాల అతిక్రమణల పట్ల నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టిసా రిస్తే ఈ సమస్య ఉండేది కాదని నగరపాలక సం స్థ వర్గాలు అంటున్నాయి. అదనపు ఫ్లోర్లు, అతి క్రమణలు జరిగే వరకూ ప్రేక్షకపాత్ర పోషించ డంతోనే ఈ సమస్య తలెత్తుతోంది.


ఆదర్శనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అదనపు ఫ్లోర్ , పెంట్ హౌస్

కోర్టు ఉత్తర్వుల మేరకు చర్యలు

నగరంలో అధిక సంఖ్యలో భవనాలకు చార్జ్ షీట్లు వేసిన మాట వాస్తవమే. కోర్టు ఉత్తర్వుల మేరకు నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. భవ నాల అతిక్రమణ చేపట్టరాదని ముందస్తుగానే నోటీసులు జారీ చేస్తున్నాం. టౌన్ ప్లానింగ్ మార్గ దర్శకాల ప్రకారమే ముందుకెళ్తున్నాం.

– భాగ్యలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్

వర్సిటీలో భద్రత కట్టుదిట్టం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం క్యాం పస్‌లో భద్రత మరింత కట్టుదిట్టం చేయనున్నట్లు వీసీ జింకా రంగజనార్దన తెలిపారు. మెకానికల్ విభాగం వర్క్‌షాప్‌లో ఉన్న పాత మెటీరియల్‌తో 10 బ్యారికేడ్లను తయారు చేశారు. ఈ సందర్భం గా వీసీ వర్క్‌షాప్ సిబ్బందిని, ఇన్‌చార్జ్ డాక్టర్ ఓం ప్రకాష్‌ను అభినందించారు. క్యాంపస్‌లో నిరంతర పర్యవేక్షణకు సీసీ కెమెరాలను అందు బాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో రెక్టార్ ప్రొఫెసర్ ఎం.విజయకుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి. శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ఓటీపీఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. దుర్గాప్రసాద్, వైస్ ప్రిన్సి పాల్ ప్రొఫెసర్ అరుణకాంతి, ప్రొఫెసర్ ఎస్. చంద్రమోహన్ రెడ్డి, ప్రొఫెసర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అనంతపురం క్రైం: రాజీవ్ కాలనీకి చెందిన తోట వెంకటరమణ అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్ర యిస్తుండగా నాల్గో పట్టణ పోలీసులు తపోవనం వద్ద పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 600 టెట్రా ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ప్రతా ప్‌రెడ్డి తెలిపారు. బెంగళూరు నుంచి టెట్రా ప్యాకె ట్లను అనంతపురానికి తెచ్చి సోమనాథ్‌నగర్‌లోని కృప హోటల్ వద్ద వేచి ఉండగా, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతన్ని శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

భూ పంపిణీ వేగవంతం చేయండి

చెన్నేకొత్తపల్లి: భూ పంపిణీ ప్రక్రియను వేగవం తం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురు వారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రామగి రి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల అధి కారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. మూడు మండలాల్లో జరుగుతున్న గృహ నిర్మాణాలను వేగవంతంగాపూర్తి చేయాలని లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో అందించేలా అధికారులు చొరవచూపాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దా ర్లు షాబుద్దీన్, నారాయణ స్వామి, హౌసింగ్ డీఈ శంకర్‌లాల్ నాయక్, ఎంపీడీఓ గంగావతి, జెడ్పీటీసీలు గోవిందరెడ్డి, మారుతీ, నాగార్జున, ఎంపీపీ అంజలి పలువురు ఎంపీటీసీలు, సర్పం చులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీతోనే సామాజిక విప్లవం

అనంతపురం సిటీ: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సామాజిక విప్లవం సాధ్యమని జెడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బేడ, బుడగ జంగాలను తిరిగి ఎస్సీ జాబితాలో చేరుస్తూ, పార్లమెంట్‌కు పంపిన నేపథ్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు ఆమె హాజరయ్యారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి మేరుగు నాగా ర్జున, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, నంబూరు శంక ర్‌రావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, బేడ, బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎలమర్తి మధు పాల్గొన్నారు. అనం తరం గిరిజమ్మ మాట్లాడుతూ చంద్రబాబునా యుడు తన పాలనకాలమంతా బేడ, బుడగ జం గాలను మోసగించి, ఎన్నికల్లో వారిని కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చాక, సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, ఉద్యోగాల్లోనే కాకుండా రాజకీయ రంగం లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 శాతం అవకాశాలు కల్పించి సామాజిక న్యాయాన్ని అమలు చేశారన్నారు.


మాట్లాడుతున్న జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ

విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యంతో ప్రజల బేజారు

ఆత్మకూరు: మండలంలోని విద్యుత్ అధికారుల తీరుతో ప్రజలు విసిగిపోతున్నారు. ఏదైనా సమస్య ఉందని అధికారులను కలిస్తే సక్రమంగా సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఆత్మకూరులోనే కాకుండా గ్రామాల్లో కూడా విద్యుత్ వైర్లు చేతికి అందే పరిస్థితిలో ఉన్నా, ప్రజలు అధికారుల దృ ష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని పరిస్థితి. ట్రాన్స్‌ఫా ర్మర్ల కోసం కార్యాలయం చుట్టూ రైతులు తిరుగు తున్నారు. పేరూరు డ్యాంకు నీరు రావడంతో మండలంలోని బోరుబావుల్లో నీరు సమృద్ధిగా వస్తోంది. మండల వ్యాప్తంగా 50 మందికిపైగా రైతులు డీడీలు కట్టి ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కార్యా లయం చుట్టూ తిరుగుతున్నారు. ట్రాన్స్‌ఫార్మ ర్లకోసం అధికారుల చేతులు తడపాల్సి వస్తోం దన్న విమర్శలు ఉన్నాయి.


ఆత్మకూరు విద్యుత్ కార్యాలయం

విమర్శలకు తావివ్వకండి

అనంతపురం అర్బన్: విధి నిర్వహణలో ఏదశలోనూ విమర్శలకు తావివ్వకూడదని కలెక్టర్ గౌతమి గుంత కల్లు ఆర్డీఓ వి.శ్రీనివాసులురెడ్డికి సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల లక్ష్యాల పూర్తిపై దృష్టిసారించాలని చెప్పారు. కలెక్టర్‌ను గురువారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో ఆర్డీఓగా నియ మితులైన శ్రీనివాసులు రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అంద జేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం, స్పందన అర్జీలు నాణ్యతగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. గుంతకల్లు ప్రత్యేక అధికారిగా ఇళ్ల నిర్మాణం, ప్రభుత్వ ప్రాధాన్యత భవ నాల నిర్మాణం, రీ సర్వే, ఓటరు జాబితా సవరణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తికి చర్యలు తీసుకోవాలని సూచించారు.


కలెక్టర్ గౌతమికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులురెడ్డి

సందడిగా గ్యార్మీ వేడుకలు


గ్యార్మీవేడుకల్లో పాల్గొన్న నాయకులు

అనంతపురం కల్చరల్: నగరంలోని హౌసింగ్ బోర్డులో మైనార్టీ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో నగర మేయర్ వసీం, వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రా రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ పాల్గొ న్నారు. వారు మాట్లాడుతూ కులమతాలకతీతంగా గ్యార్మీ వేడుకలు జరుపుకుంటున్నట్లు తెలిపారు. పీరానే పీర్ గౌసుల్ ఆజం దస్తగిర్ (దస్తగిరి స్వామి) విశిష్టతను గుర్తు చేసుకున్నారు. అంతకుముందు ఫకీర్ల ప్రత్యేక వాయిద్యాల నడుమ సందల్ ఊరేగిం పు, ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ అధ్యక్షుడు సైపుల్లా బేగ్, కార్పొరేటర్ కమల్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

15న ప్రజారక్షణ భేరి బహిరంగ సభ

రాప్తాడు: ఈనెల 15న విజయవాడలో ప్రజార క్షణ భేరి భారీ బహిరంగ సభ ఉంటుందని సీపీ ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి రాష్ట్ర బస్సుజాతా రాప్తాడుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలు తీవ్రంగా నష్టపోయార న్నారు. రైతాంగాన్ని ఆదుకోవాలని, ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు పంట నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గఫూర్, రాష్ట్ర కమిటీ నాయకులు ఉమామహే శ్వర రావు, కృష్ణయ్య, శివ నాగరాణి, దయా, రమాదేవి, భాస్కరయ్య, సీనియర్ నాయకులు ఓబులు, బాలరంగయ్య, చంద్రశేఖర్ రెడ్డి, పోతు లయ్య తదితరులు పాల్గొన్నారు.


బస్సుజాతాలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి

94 శాతం పింఛన్ పంపిణీ

అనంతపురం కార్పొరేషన్: నగరంలో పింఛన్ పం పిణీ విజయవంతంగా సాగుతోంది. గురువారం రెండో రోజు 50 డివిజన్లలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు. మొత్తం 23,485 లబ్ధి దారులకుగానూ ఇప్పటి వరకు 22,143 మందికి రూ.6,22,04,500 (రూ.6.2 కోట్లు) పింఛన్ (94.29 శాతం) పంపిణీ చేశారు. శుక్రవారం పిం ఛన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ


మల్లెల చిన్న గంగాధర్‌ను సన్మానిస్తున్న ఎల్‌ఎం ఉమ

అనంతపురం: జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రిటైర్డ్ హెచ్‌ఎం మల్లెల చిన్న గంగాధర్ రచించిన సుగంధ గంగాధరం అనే 80 పుస్తకాలను గురువారం అంద జేశారు.ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఎల్‌ఎం ఉమ దాతలను సన్మానించారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత

రాప్తాడు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉం డొచ్చని ఐసీడీఎస్ సూపర్ వైజర్ హేమలత అన్నారు. గర్భిణులు, బాలింతలతో పాటు, ఐదేళ్ల లోపు చిన్నా రులకు సైతం సంపూర్ణ పోషకాహారం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గురువారం మండలంలోని ప్రసన్నాయపల్లిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, ఐదేళ్ల చిన్నారు లకు పౌష్టికాహాన్ని సక్రమంగా పంపిణీ చేయాల న్నారు. 10 రకాల సరుకులను ప్రత్యేక సంచుల్లో నెలకు రెండు సార్లు ఇంటికే అందించే బృహత్తర కార్య క్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సరోజ, సూర్యకళ, ఆయాలు శ్రీలత, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇటుకులపల్లి సీఐని సస్పెండ్ చేయాలి

అనంతపురం క్రైం: ఇటుకలపల్లి సీఐని సస్పెండ్ చేయాలని డీఐజీ ఆర్ఎన్ అమ్మిరెడ్డికి సీపీఎం నాయకులు విన్నవించారు. గురువారం సీపీఎం ఆధ్వర్యంలో డీఐజీకి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గార్లదిన్నె మండల పరిధిలో పేదల గుడిసెలు తొలగించే విషయంలో ఇటుకలపల్లి సీఐ వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. సుమారు రూ. 2 కోట్ల విలువ చేసే సామగ్రిని ధ్వంసం చేశార న్నారు. 150 గుడిసెల్లో ఉంచిన సామగ్రిని కూడా బయటకు తీసుకోనివ్వకుండా సీఐ దారుణంగా వ్యవ హరించారన్నారు. డీఐజీకి వినతిపత్రం అందించిన వారిలో సీపీఎం నేతలు వి.రాంభూపాల్, ఆర్వీ నాయుడు, ఆవాజ్ వలీ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వం పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా వైద్య రం గాన్ని బలోపేతం చేసిందని ఎమ్మెల్యే అనంత వెంక టరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని బుడ్డప్పనగర్, సూర్యనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఎమ్మెల్యే పరిశీ లించారు. పేదరికంతో విద్య, వైద్యం ఏ ఒక్కరికి భారం కాకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మో హన్ రెడ్డి వివిధ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సదుపాయాన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిని గుర్తించి, మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో స్పెషలిస్టు వైద్యులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ రకాల రుగ్మతలతో బాధపడుతున్న వారిని జిల్లా, ఏరియా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్‌చేసి, మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు లీలావతి, సాకే చంద్రలేఖ, అబూసలేహా, వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్‌మోహన్, సాకే కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.


బుడ్డప్పనగర్‌లో ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యసేవలపై తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనంత

సీటీఎం రమేష్ బాబుకు అదనపు బాధ్యతలు

అనంతపురం సెంట్రల్: ఏపీఎస్ ఆర్టీసీ కార్గో ఏటీఎంగా అదనపు బాధ్యతలు సీటీఎం రమేష్ బాబు గురువారం అదనపు బాధ్యతలు స్వీకరిం చారు. వెంటనే కార్గో ఆఫీస్‌ను సందర్శించి, బుకిం గ్ కౌంటర్ , డెలివరీ కౌంటర్‌ను పరిశీలించారు. ఆం ధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా సంస్థ కార్గో సేవలను విని యోగించుకోవాలని కోరారు. డోర్ డెలివరీ ప్రచా రంలో భాగంగా బస్టాండ్‌లో అనంతపురం నుంచి కర్నూల్‌కు వెళ్లే ప్రయాణికులకు అక్టోబర్ 26 నుంచి నవంబర్ 25 వరకూ డోర్ డెలివరీ మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇక నుంచి రాష్ట్ర వ్యాప్తం గా 84 ముఖ్య పట్టణాలకు 50 కేజీల వరకు ఆయా ఆర్టీసీ డిపోల నుంచి 10 కిలో మీటర్లలోపు ఉన్నవా రికి డోర్ డెలివరీ సదుపాయం కల్పిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో డీఎంఈ కొండయ్య, ఆర్ ఎంఈ షాకీరా బేగం, బస్‌స్టేషన్ మేనేజర్ మూర్తి, స్క్వాడ్ ఇన్‌చార్జ్ శివలింగప్ప, కార్గో సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.


కార్గో పార్సిల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న సీటీఎం రమేష్‌బాబు

అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండండి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రామకృష్ణారెడ్డి

రాప్తాడురూరల్: నగర శివారు కాలనీలు, మండల పరిధిలోని గ్రామాల్లో అనుమానిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి హెచ్చరించారు. గురువారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం కాటిగానికాలవలో పర్యటించారు. గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేసి, పలు సూచనలు చేశారు. ఈ ప్రాంతాల్లో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానంగా తిరుగుతుంటే వెంటనే డయ ల్–100కు సమాచారం అందించాలన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తుంటే పోలీసులకు తెలియజే యాలన్నారు. గ్రామాల్లో అందరూ కలిసిమెలసి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆండ్రాయిడ్ ఫోన్లు వాడుతుంటారని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. గ్రామాల్లో ఏ సమస్య తలెత్తినా, ఏ సమయంలోనైనా పోలీస్ స్టేషన్‌కు ధైర్యంగా రావచ్చన్నారు. సచివాలయ పరిధిలోని మహిళా పోలీస్ కూడా అందుబాటులో ఉంటార న్నారు. సీఐ వెంట ఎస్‌ఐ కేవీ రమణ, సిబ్బంది ఉన్నారు.

బీఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగుల ధర్నా


బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అనంతపురం సిటీ: అనంతపురంలోని బీఎస్‌ఎన్ ఎల్ జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు గురువారం ధర్నా చేశారు. 'జాయిం ట్ ఫోరం ఆఫ్ నాన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్స్ అండ్ అసోసియేషన్స్ ఆఫ్ బీఎస్‌ఎన్‌ఎల్' పిలుపు మేరకు గంట పాటు ఆందోళన చేశారు. 4జీ, 5జీ సేవలకు అనుమతి ఇవ్వడంతో పాటు వేతన సవరణ డిమాండ్‌ను అమలు చేయాలని కోరుతూ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

స్నేహలత ఆస్పత్రిలో చక్కెర వ్యాధి రోగి మృతిపై ఆందోళన

అనంతపురం క్రైం: స్థానిక స్నేహలత ఆస్పత్రిలో చక్కెర వ్యాధికి చికిత్స పొం దుతూ మద్దిలేటి (63) మృతిచెందాడు. మద్దిలేటి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం పులేటిపల్లికి చెం దిన మద్దిలేటి చాలా కాలంగా చెక్కర వ్యాధితో బాధపడుతున్నాడు. కిడ్నీ సం బంధిత వ్యాధులు కూడా ఉన్నాయి. చికిత్స కోసం నగరంలోని స్నేహలత ఆస్పత్రిలో మంగళవారం చేరారు. గురువారం ఉదయం ఆయన పరిస్థితి విష మంగా మారి మృతిచెందాడు. వైద్యుడు సకాలంలో చికిత్స అందించకపోవడం తోనే మద్దిలేటి మృతిచెందాడని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మద్దిలేటి మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. వన్‌టౌన్, టూటౌ న్, నాల్గో పట్టణ సీఐలు శివరాముడు, ప్రతాప్‌రెడ్డి, ఎస్‌ఐలు వెంకటేశ్వర్లు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. వైద్యుల నిర్లక్ష్యం తోనే తన తండ్రి చనిపోయాడని మృతుడి కుమారుడు నరేష్ వన్‌టౌన్ పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి ఆస్పత్రిని సందర్శించి, రోగికి సంబంధించిన కేస్ షీట్ స్వాధీనం చేసుకున్నారు. రోగి మృతిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడతామని తెలిపారు.

సాక్షి బిజినెస్
శుక్రవారం
3-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
490	144
64,081	19,133

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,260	▲ 199
డోజోన్స్	33,721	▲ 446
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,447	▲ 104
డాక్స్	15,144	▲ 220
షాంఘై	3,009	▲ 14
నికాయ్	31,950	▲ 348

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,092	▲ 80
బంగారం (99.5 స్వచ్ఛత)	60,847	▲ 79
వెండి (కేజీ)	71,684	▲ 700

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.49	84.26
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	99.73	101.94
€	యూరో	ఒకటి	86.78	89.19
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.27	55.87
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	51.63	54.39
S$	సింగపూర్ డాలర్	ఒకటి	59.12	60.98
SAR	సౌదీ రియాల్	ఛామనీతి	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	ఛామనీతి	21.87	23.49
¥	చైనా యువాన్	ఛామనీతి	10.23	12.29

పోస్ట్ ద్వారా 2,000 నోట్ల మార్పిడి

బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ



న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రాంతీయ కార్యాలయాలకు దూరంగా ఉండే ప్రజలు తమ వద్ద ఉన్న రూ.2,000 నోట్లు మార్చుకోవడానికి సులభతరమైన విధానం అమలవుతోంది. పోస్ట్ ద్వారా ఈ మేరకు ప్రజలు సేవలు పొందవచ్చని ఇప్పటికే ప్రకటించిన ఆర్‌బీఐ ఉన్నతాధికారులు ఇందుకు వీలైన ప్రక్రియపై ప్రచారాన్ని చేపట్టారు. ఇన్సూర్డ్ పోస్ట్ లేదా టీఎల్ఆర్ (3 అంచెల రక్షణ) కవర్‌ను వినియోగించుకుని సురక్షితమైన మార్గంలో రూ.2,000 నోట్లు మార్చుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ విధానంలో పెద్ద నోట్ల మార్పిడికి సంబంధించిన డబ్బు సంబంధిత వినియోగదారు బ్యాంక్ ఖాతాల్లో జమవుతుంది. ''కస్టమర్లు రూ. 2,000 నోట్ల మార్పునకు సంబంధించిన డబ్బు తమ ఖాతాలో అత్యంత సురక్షితమైన పద్ధతిలో ప్రత్యక్షంగా క్రెడిట్ కావడానికి వీలుగా ఇన్సూర్డ్ పోస్ట్‌ను వినియోగించుకోవాలని ప్రోత్సహిస్తున్నాము. ఈ విధానం నిర్దేశిత ప్రాంతీయ కార్యాలయాలకు ప్రయాణించడం, వరుసలో నిలబడ్డం వంటి ఇబ్బందుల నుంచి వినియోగదారుని నివారిస్తుంది'' అని ఆర్‌బీఐ రీజినల్ డైరెక్టర్ రోహిత్ పి. దాస్ అన్నారు. చెలామణిలో ఉన్న రూ.2,000 నోట్లలో 97 శాతానికి పైగా తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థకు చేరాయని ఆర్‌బీఐ తెలిపింది. అక్టోబర్ 30వ తేదీ నాటికి రూ.10,000 కోట్ల విలువైన నోట్లు మాత్రమే ప్రజల వద్ద ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది మే 19న ఆర్‌బీఐ రూ.2,000 డినామినేషన్ నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. దేశంలోని 19 ఆర్‌బీఐ కార్యాలయాల్లో ప్రజలు రూ. 2,000 నోట్లను డిపాజిట్ చేయవచ్చు లేదా మార్చుకోవచ్చు. రూ.2 వేల నోట్ల డిపాజిట్ లేదా మార్పిడి సేవలను బ్యాంకు శాఖలు అక్టోబర్ 7 వరకు అందించాయి. అక్టోబర్ 8 నుంచి ఈ సేవలు 19 ఆర్‌బీఐ కార్యాలయాలకు మారాయి.

కోటక్ ఇన్సూరెన్స్‌లో 'జ్యూరిక్'కు వాటాలు

51% కొనుగోలు; డీల్ విలువ రూ. 4,051 కోట్లు

ముంబై: సాధారణ బీమా సంస్థ కోటక్ జనరల్ ఇన్సూరెన్స్‌లో (కేజీఐ) స్విట్జర్లాండ్‌కు చెందిన జ్యూరిక్ ఇన్సూరెన్స్ 51 శాతం వాటాలు దక్కించుకోనుంది. ఇందుకోసం రూ. 4,051 కోట్లు వెచ్చించనుంది. తదుపరి అదనంగా మూడేళ్లలో అదనంగా 19 శాతం వాటాలు కూడా జ్యూరిక్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేయనున్నట్లు కేజీఐ మాతృ సంస్థ కోటక్ మహీంద్రా బ్యాంక్ వెల్లడించింది. వృద్ధి అవకాశాలు పటిష్టంగా ఉన్న కీలక మార్కెట్లలో భారత్ కూడా ఒకటని, కేజీఐ తమకు పటిష్టమైన భాగస్వామి కాగలదని జ్యూరిక్ సీఈవో (ఆసియా పసిఫిక్) తులసి నాయుడు తెలిపారు. తమ కస్టమర్లకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇరు సంస్థల వనరులు, అనుభవం తోడ్పడగలవని కోటక్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ దీపక్ గుప్తా పేర్కొన్నారు. ప్రీమియంలపరంగా నాన్-లైఫ్ మార్కెట్‌లో సెప్టెంబర్‌లో కేజీఐకి 0.52 శాతం వాటా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 1,148 కోట్ల మేర స్థూల ప్రీమియం సాధించింది. కొత్త పెట్టుబడుల అనంతరం సంస్థ విలువ రూ. 7,943 కోట్లుగా ఉండనుంది.

ఫ్యాషన్ స్టార్టప్స్‌లో అజియో పెట్టుబడులు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా 100 డైరెక్ట్ టు కస్టమర్ ఫ్యాషన్ స్టార్టప్స్‌లో పెట్టుబడి పెట్టాలని లైఫ్‌స్టైల్, ఫ్యాషన్ ఈ-కామర్స్ కంపెనీ అజియో భావిస్తోంది. ఈ స్టార్టప్స్ తయారు చేసే, విక్రయించే దుస్తులు, పాదరక్షలు, యాక్సెసరీస్ వంటి ఉత్పత్తులను డైరెక్ట్ టు కన్స్యూమర్ వేదిక అయిన అజియోగ్రామ్‌లో అందుబాటులో ఉంచనుంది. భారతీయ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ విభాగంలోని 200 బ్రాండ్స్‌ను ఎక్స్‌క్లూజివ్‌గా అజియోగ్రామ్‌లో వచ్చే ఏడాదికల్లా చేర్చనున్నట్టు వెల్లడించింది. ఈ బ్రాండ్స్ విస్తరణకు, ఆదాయ వృద్ధికి పూర్తి సహకారం అందించనున్నట్టు అజియో ప్రకటించింది.

దాతృత్వంలో శివ్ నాడార్ టాప్

- రూ. 2,042 కోట్ల విరాళం
- ఎడెల్‌గివ్ హురున్ ఇండియా లిస్టులో అగ్రస్థానం



ముంబై: విరాళాలివ్వడంలో ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ చీఫ్ శివ్ నాడార్ మరోసారి తన ఉదారత చాటుకున్నారు. 2023లో ఏకంగా రూ. 2,042 కోట్లు విరాళమిచ్చి ఎడెల్‌గివ్ హురున్ ఇండియా 2023 జాబితాలో అగ్రస్థానంలో నిల్చారు. గతేడాది ఇచ్చిన రూ. 1,161 కోట్లతో పోలిస్తే ఇది 76 శాతం అధికం. విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ రూ. 1,774 కోట్లతో (గతేడాదితో పోలిస్తే 267 శాతం అధికం) రెండో స్థానంలోనూ, రూ. 376 కోట్లతో రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీ ముకేశ్ అంబానీ మూడో స్థానంలో ఉన్నారు. అంబానీ విరాళాలు గతేడాదితో పోలిస్తే 8 శాతం తగ్గాయి. ఆదిత్య బిర్లా గ్రూప్ చీఫ్ కుమార మంగళం బిర్లా రూ. 287 కోట్లతో నాలుగో స్థానంలో, అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ రూ. 285 కోట్లతో (50 శాతం అధికం) ఈ జాబితాలో అయిదో స్థానంలో ఉన్నారు. ఇటీవలి హురున్ కుబేరుల జాబితా ప్రకారం అంబానీ సంపద రూ. 8.08 లక్షల కోట్లుగాను, అదానీది రూ. 4.74 లక్షల కోట్లు, నాడార్ సంపద రూ. 2.28 లక్షల కోట్లుగాను ఉంది. సంపద పెరిగే కొద్దీ సంపన్న కుటుంబాలు .. అట్టడుగు వర్గాల వారి కోసం ఆహారం, దుస్తులు, ఉపకార వేతనాలు మొదలైన దాతృత్వ కార్యకలాపాలకు విరాళాలిచ్చే ధోరణి పెరుగుతోందని హురున్ ఇండియా చీఫ్ రీసెర్చర్ అనాస్ రెహ్మాన్ జునైద్ తెలిపారు. లిస్టులో మొత్తం 119 మంది వ్యక్తులు, కుటుంబాలు ఉన్నాయి.

మరిన్ని వివరాలు..

- బజాజ్ కుటుంబంతో పాటు సైరస్ ఎస్ పూనావాలా, అదార్ పూనావాలా, రోహిణి నీలేకని వంటి వారు టాప్ 10లో నిల్చారు. మహిళల్లో నీలేకనితో పాటు అను ఆగా (థర్మాక్స్), లీనా గాంధీ తివారీ (యూఎస్‌వీ) కూడా ఉన్నారు.
- డిస్కౌంటు బ్రోకరేజీ జిరోధా సహ-వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఈ జాబితాలో అత్యంత పిన్న వయస్కుడు. కామత్ సోదరులు రూ. 110 కోట్లు విరాళమిచ్చారు.
- రూ. 150 కోట్ల విరాళంతో ఎల్‌అండ్‌టీ గౌరవ చైర్మన్ ఏఎం నాయక్ .. ప్రొఫెషనల్స్ జాబితాలో అగ్రస్థానంలో, ఓవరాల్ లిస్టులో 11వ స్థానంలో ఉన్నారు.

గెయిల్‌కు బీపీసీఎల్ ముడిసరుకు సరఫరా

రూ. 63,000 కోట్ల ఒప్పందం

న్యూఢిల్లీ: మహారాష్ట్రలో నెలకొల్పుతున్న పెట్రోకెమికల్ ప్లాంటుకు అవసరమైన ముడిసరుకు కోసం భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)తో గెయిల్ (ఇండియా) ఒప్పందం కుదుర్చుకుంది. ఈ డీల్ విలువ రూ. 63,000 కోట్లు. దీని ప్రకారం 15 ఏళ్ల పాటు గెయిల్‌కు చెందిన ఉసార్ ప్లాంటుకు బీపీసీఎల్ తమ ఎల్‌పీజీ దిగుమతి కేంద్రం నుంచి ఏటా 6 లక్షల టన్నుల ప్రొపేన్ గ్యాస్‌ను సరఫరా చేయనుంది. ఉసార్‌లో 5,00,000 టన్నుల సామర్థ్యంతో గెయిల్ దేశీయంగా తొలి ప్రొపేన్ డీహైడ్రోజినేషన్ (పీడీహెచ్) ప్లాంటును నిర్మిస్తోంది. ఈ ప్లాంటు 2025 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఫర్నిచర్ ఉపకరణాలు, బొమ్మలు మొదలైన వాటిలో ఉపయోగించే పాలీప్రొపిలీన్ తయారీ ప్లాంటుకు ఇది అనుసంధానమై ఉంటుంది.

మార్కెట్‌కు 'ఫెడ్' బూస్ట్!

- ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ వడ్డీ రేట్లు యథాతథం
- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో జోష్
- 490 పాయింట్లు పెరిగి 64 వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 144 పాయింట్ల లాభంతో 19,100 పైకి నిఫ్టీ

ముంబై: అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను ఊహించినట్లే యథాతథంగా ఉంచడంతో పాటు సరళతర ద్రవ్య విధాన అమలు వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్లలో సానుకూలతలు నింపాయి. దేశీయంగా వాహన విక్రయాలు రికార్డు గరిష్టానికి చేరుకోవడం, జీఎస్‌టీ వసూళ్లు పెరగడం, కార్పొరేట్ క్యూ2 ఆర్థిక ఫలితాలు మెప్పించడం కలిసొచ్చాయి. ఫలితంగా గురువారం సెన్సెక్స్ 490 పాయింట్లు పెరిగి 64,081 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 144 పాయింట్లు బలపడి 19,133 వద్ద నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం భారీ లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభం నుంచి అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు ఆద్యంతం జోరు కనబరిచాయి. ఒక దశలో సెన్సెక్స్ 611 పాయింట్లు దూసుకెళ్లి 64,203 వద్ద, నిఫ్టీ 186 పాయింట్లు బలపడి 19,175 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. రియల్టీ, ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా షేర్లకు చిన్న, మధ్య తరహా షేర్లు భారీ డిమాండ్ లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు ఒకశాతానికి పైగా ర్యాలీ చేశాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,261 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1380 కోట్ల షేర్లు కొన్నారు. ఫెడ్ రిజర్వ్ నుంచి సానుకూల సంకేతాలు, జపాన్ ప్రభుత్వం 113 బిలియన్ డాలర్ల ఉద్దీపన ప్యాకేజీకి ప్రకటన, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ సైతం వడ్డీరేట్ల జోలికెళ్లకపోవడం తదితర పరిణామాలతో ఆసియా, యూరప్ మార్కెట్లు 1-2% ర్యాలీ చేశాయి. అమెరికా స్టాక్ మార్కెట్లు 1-1.5 శాతం లాభాల్లో ట్రేడవుతున్నాయి.



- సెన్సెక్స్ ర్యాలీతో బీఎస్ఈలో ఇన్వెస్టర్లు సంపదగా భావించే కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.3.1 లక్షల కోట్లు పెరిగి రూ. 313.32 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ 30 షేర్లలో టెక్ మహీంద్రా(1%), బజాజ్ ఫైనాన్స్(0.25%) మాత్రమే నష్టపోయాయి.
- క్యూ2 నికర లాభం ఐదు రెట్లు వృద్ధి సాధించడంతో జేకే టైర్ షేరు 10% లాభపడి రూ.337 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 14% ర్యాలీ చేసి రూ.351 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.
- క్యూ2 ఫలితాల ప్రకటన తర్వాత హీరో మోటోకార్ప్ షేరులో లాభాల స్వీకరణ జరిగింది. 1% నష్టపోయి రూ.3050 వద్ద స్థిరపడింది.

లాభాల్లోకి టాటా మోటార్స్

- క్యూ2లో రూ. 3,783 కోట్లు
- జేఎల్ఆర్ అమ్మకాలు జూమ్



న్యూఢిల్లీ: ఆటో రంగ దిగ్గజం టాటా మోటార్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై-సెప్టెంబర్(క్యూ2)లో రూ. 3,783 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది (2022-23) ఇదే కాలంలో రూ. 1,004 కోట్ల నికర నష్టం ప్రకటించింది. బ్రిటిష్ లగ్జరీ కార్ల అనుబంధ సంస్థ జాగ్వార్ ల్యాండ్ రోవర్(జేఎల్ఆర్) పనితీరు లాభాలకు దోహదపడింది. వెరసి వరుసగా నాలుగో త్రైమాసికంలోనూ లాభాలను ప్రకటించగలిగింది. ఆదాయం రూ. 79,611 కోట్ల నుంచి రూ. 1,05,128 కోట్లకు దూసుకెళ్లింది. ఇక స్టాండెలోన్ ప్రాతిపదికన సైతం రూ. 1,270 కోట్ల నికర లాభం సాధించగా.. గతేడాది క్యూ2లో రూ. 293 కోట్ల నికర నష్టం నమోదైంది.

ఇకపై మరింత దూకుడు: తాజా సమీక్షా కాలంలో జేఎల్ఆర్ ఆదాయం 30 శాతం జంప్ చేసి 6.9 బిలియన్ పౌండ్లకు చేరింది. హోల్‌సేల్ అమ్మకాలు, కొత్త ప్రొడక్టులు, వ్యయ నియంత్రణలు, డిమాండుకు అనుగుణమైన పెట్టుబడులు ఇందుకు సహకరించాయి. కాగా.. ఈ ఏడాది ద్వితీయార్థం(అక్టోబర్-మార్చి)లో హోల్‌సేల్ అమ్మకాలు క్రమంగా జోరందుకోనున్నట్లు కంపెనీ అంచనా వేస్తోంది. నిర్వహణ(ఇబిట్) మార్జిన్లు గత 6 శాతం అంచనాలకంటే అధికంగా 8 శాతాన్ని తాకవచ్చని భావిస్తోంది. ఈ ఏడాది 2 బిలియన్ పౌండ్ల ఫ్రీ క్యాష్‌ఫ్లోను సాధించగలదని ఆశిస్తోంది. వెరసి మార్చికల్లా నికర రుణ భారం బిలియన్ పౌండ్లకంటే దిగువకు చేరవచ్చని అభిప్రాయపడింది.

ఫలితాల నేపథ్యంలో టాటా మోటార్స్ షేరు 1.5% బలపడి రూ. 637 వద్ద ముగిసింది.

ర్యాలీలు, మీటింగులుండవ్!

బ్యానర్లు, నినాదాలు అస్సలుండవు • మిజోరంలో ప్రచారం రూటే వేరు

ఎన్నికలంటేనే బోలెడంత హడావుడి, ప్రచారం, సభలు, సందడి. మరీ ముఖ్యంగా మన దేశంలోనైతే ఆ ఊపే వేరు. కానీ మిజోరంలో మాత్రం ఈ పరిస్థితి ఎక్కడా కనిపించదు. పార్టీల ర్యాలీలు, భారీ బహిరంగ సభలు, రోడ్లను బ్లాక్ చేసేయడం వంటివి కాగడా వేసి వెదికినా ఎక్కడా కనిపించవు. అసలు రోడ్లపై గానీ, మరెక్కడైనా నినాదాలు విన్పించడం, బ్యానర్లు కన్పించడం కూడా ఉండదంటే అతిశయోక్తి కాదు!

ప్రచారమంతా చర్చి ఆధ్వర్యంలోనే...

మిజోరంలో అత్యంత బలమైనది చర్చి వ్యవస్థ. రాష్ట్రంలో పార్టీల ఎన్నికల ప్రచార ప్రక్రియ ఆసాంతం చర్చి ఆధ్వర్యంలో నడిచే మిజో పీపుల్స్ ఫోరం (ఎంపీఎఫ్) చర్చి కనుసన్నల్లోనే జరుగుతుంది. గత మూడు ఎన్నికల నుంచీ ఇది మరింతగా కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.



ఏం చేస్తుంది?

- ఎంపీఎఫ్ అసెంబ్లీ స్థానాలవారీగా కమ్యూనిటీ సమావేశాలు ఏర్పాటు చేస్తుంది.
- ఆ నియోజకవర్గంలోని అందరు అభ్యర్థులూ అక్కడికే వస్తారు.
- తమ విధానాలు, పథకాలు తదితరాలను ఒక్కొక్కరుగా ప్రజల ముందు పెడతారు.
- ఇందుకు ఒక్కొక్కరికి 20 నిమిషాలు టైం కేటాయిస్తారు.
- ఏ గొడవలకు, ఉద్రిక్తతలకు తావులేకుండా కార్యక్రమం సాగుతుంది.

దేశమంతటా ఎన్నికల ప్రచారం ఇలాగే సాగాలంటూ చట్టం తెస్తే బాగుంటుందేమో కదా!

పంచతంత్రం

అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్, మిజోరంలకు రెండు ప్రత్యేక రికార్డులున్నాయి. రెండు మహిళలకు సంబంధించినవే కావడం విశేషం. అసెంబ్లీలో మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ నిలిస్తే, అత్యల్ప ప్రాతినిధ్యమున్న రాష్ట్రంగా మిజోరం చెత్త రికార్డును మూటగట్టుకుంది. దాని చరిత్రలో ఇప్పటిదాకా ఎమ్మెల్యేలైన మహిళల సంఖ్య కేవలం నాలుగే! ప్రస్తుత మిజోరం అసెంబ్లీలోనైతే ఒక్కరంటే ఒక్క మహిళా ఎమ్మెల్యే కూడా లేరు! అంతేకాదు, 2014 ఉప ఎన్నికలో నెగ్గిన వన్లాల్‌వాంపుయ్ చోంగ్తూను మినహాయిస్తే గత 27 ఏళ్లలో రాష్ట్రంలో ఒక్క మహిళ కూడా ఎమ్మెల్యేగా ఎన్నికవలేదు! ఇక లోక్‌సభకైతే మిజోరం చరిత్రలోనే ఇప్పటిదాకా ఒక్క మహిళ కూడా ఎన్నికవలేదు! ఇక ఇప్పటిదాకా ఇద్దరంటే ఇద్దరు మహిళలు మాత్రమే మంత్రులయ్యారు!



- మిజోరం అసెంబ్లీలో కానరాని స్త్రీలు
- దేశంలోకెల్లా అత్యల్ప ప్రాతినిధ్యం
- ఇప్పటిదాకా నలుగురే మహిళా ఎమ్మెల్యేలు
- లోక్‌సభకైతే మహిళల ప్రాతినిధ్యం సున్నా

మహిళలకు మొండిచెయ్యే

ఆది నుంచీ...

కేంద్రపాలిత ప్రాంతం హోదాలో మిజోరంలో 1972లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అప్పుడు కేవలం నలుగురు మహిళలు మాత్రమే పోటీ చేశారు. వారిలో ఒక్కరూ నెగ్గకపోగా డిపాజిట్లు కూడా కోల్పోయారు. 1978లో ఎల్.థన్‌మావీ రూపంలో మిజోరంలో తొలిసారి ఒక మహిళ ఎమ్మెల్యేగా నెగ్గింది. ఆమెకు పడ్డ మొత్తం ఓట్లెన్నో తెలుసా? కేవలం 1,824. కేవలం 119 ఓట్ల మెజారిటీతో గట్టెక్కారామె! అన్నట్టు, ఆ ఎన్నికల్లో పోటీ చేసిన ఏకైక మహిళ కూడా ఆమే. అనంతరం ఏడాదిలోపే మళ్లీ జరిగిన ఎన్నికల్లోనూ నలుగురు పురుష అభ్యర్థులతో తలపడి కేవలం 42 ఓట్ల మెజారిటీతో మళ్లీ గెలిచారామె. ఆ ఎన్నికల్లో బరిలో దిగిన మరో ఇద్దరు మహిళలు డిపాజిట్ కోల్పోయారు. 1987లో మిజోరం రాష్ట్రంగా మారాక జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు మహిళలు పోటీ పడ్డారు. ఎంఎన్ఎఫ్ తరఫున లాల్‌హ్లంపుయ్ మర్ ఐజ్వాల్ నార్త్-1 నుంచి కేవలం 306 ఓట్ల మెజారిటీతో నెగ్గారు. అనంతరం లాల్‌డెంగా మంత్రివర్గంలోనూ చోటు దక్కించుకున్నారు. మంత్రి అయిన తొలి మిజో మహిళగా రికార్డు సృష్టించారు. అనంతరం 1989, 1993 అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురేసి మహిళలు పోటీ చేసినా ఓటమి చవిచూశారు. 1998లో 10 మంది, 2003లో ఏడుగురు, 2008లో 9 మంది, 2013లో ఆరుగురు మహిళలు పోటీ చేసినా ఒక్కరూ నెగ్గలేదు. అలా 27 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత 2014లో ఉప ఎన్నికలో నెగ్గిన చోంగ్తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. అయితే ఆమెకు దక్కింది... మత్స్య, సహకార శాఖలు! కానీ, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె ఓటమి చవిచూశారు. ఆ ఎన్నికల్లో అత్యధికంగా 18 మంది మహిళలు పోటీ చేసినా ఒక్కరూ గెలుపు ముఖం చూడలేకపోయారు. పైగా ఏకంగా 16 మంది డిపాజిట్లు గల్లంతయ్యాయి.

ఈసారి...

- ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్, జోరాం పీపుల్స్ మూవ్‌మెంట్ (జెడ్‌పీఎం) ఇద్దరేసి మహిళలకు టికెట్లివ్వగా
- బీజేపీ ముగ్గురికిచ్చింది. మొత్తమ్మీద ఈసారి 16 మంది మహిళలు ఎన్నికల బరిలో దిగారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎందుకిలా...?

మిజోరంలో చట్టసభల్లో మహిళలకు అత్యల్ప ప్రాతినిధ్యానికి అక్కడి పితృస్వామ్య వ్యవస్థే ప్రధాన కారణమని చెబుతారు. పరిశీలిస్తే అది నిజమేననిపిస్తుంది కూడా. క్రైస్తవ జనాభా ఎక్కువగా ఉన్నా మిజోరం ప్రధానంగా గిరిజన రాష్ట్రం. సహజంగానే అక్కడ మహిళలకు ఇల్లు దాటికి బయటికి వెళ్లడాన్ని అంతగా ఇష్టపడరు.





ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా సంప్రదాయక దోలు వాయిస్తున్న జార్ఖండ్ బీజేపీ అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ. గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని కుంకురీ నియోజకవర్గంలోని ఖుత్గావ్ పట్టణంలో తీసిందీ ఫొటో

ఛత్తీస్‌గఢ్ ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ

కాంగ్రెస్ ఉన్నచోట

అభివృద్ధి ఉండదు

కాంకేర్: వారసత్వ రాజకీయాలు, అవినీతి, బంధుప్రీతికి మారుపేరైన కాంగ్రెస్ పార్టీకి అధికారమిస్తే అభివృద్ధి ఏమాత్రం జరగదని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో గురువారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మాట్లాడారు. అవినీతికి పాల్పడుతోందంటూ సీఎం భూపేశ్ బఘేల్ ప్రభుత్వాన్ని ఎండగట్టిన ప్రధాని మోదీ..రాష్ట్రాన్ని దోచుకున్న వారిని ఏమాత్రం ఉపేక్షించరాదన్నారు. దేశ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా తమ ప్రభుత్వం రాష్ట్రపతి పదవికి గిరిజన మహిళను ఎంపిక చేయగా దానిని కూడా కాంగ్రెస్ వ్యతిరేకించిందని ద్రౌపదీ ముర్ము ఎన్నికనుద్దేశించి ప్రధాని చెప్పారు. ఇలాంటి వైఖరి కలిగిన కాంగ్రెస్ పార్టీకి ఛత్తీస్‌గఢ్‌లోని ప్రతి గిరిజనుడూ ప్రతీకారం తీర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను మీరు శిక్షిస్తారా అని ప్రధాని ప్రశ్నించగా అవును అంటూ జనం బదులిచ్చారు. ఇతర వెనుకబడిన కులాని(ఓబీసీ)కి చెందినందునే 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తనను దూషించిందని తెలిపారు. కేంద్రంలో అధికారం కోల్పోయాక పార్టీ ప్రభుత్వాలున్న రాష్ట్రాల్లో అవినీతితో ఖజానా నింపుకుంటోందని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను నిర్లక్ష్యం చేసిందని, ఎన్నికల హామీలను నెరవేర్చ లేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో సీఎం బఘేల్ ప్రభుత్వం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాన్ని కాంగ్రెస్ కమిటీ కార్యాలయంగా మార్చేసి, ప్రభుత్వంలో పెద్దల పిల్లలు, బంధువులకు ఉద్యోగాలిచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే బస్తర్ ప్రాంతంలోని పేదలు, దళితులు, వెనుకబడిన కులాలు, గిరిజన కుటుంబాలకు హత్యలు, నేరాలు, హింస తప్ప ఏం లాభం కలిగింది? అని ప్రశ్నించారు. 'అందుకే, రాష్ట్రాన్ని దోచుకున్నవారు ఎంత శక్తిమంతులైనప్పటికీ వదలరాదు. దోచుకున్నదంతా వారి నుంచి కక్కిస్తాం. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నచోట అభివృద్ధి ఉండదు'అని మోదీ అన్నారు. మీ పిల్లల భవిష్యత్తును మోదీ, బీజేపీ చేసుకుంటాయని ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. ఛత్తీస్‌గఢ్‌లో తాము అధికారంలోకి వస్తే అభివృద్ధిని వేగవంతం చేసి, సుసంపన్నమైన ఛత్తీస్‌గఢ్‌కు పునాది వేస్తాం. రాష్ట్రాన్ని వచ్చే అయిదేళ్లలో దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. పీఎం ఆవాస్ యోజన కింద ఇళ్ల నిర్మాణం వేగవంతం చేస్తాం'అని ప్రధాని ప్రకటించారు.

మెజారిటీ రాకున్నా సరే, బీజేపీని మాత్రం కలుపుకోం: జెడ్‌పీఎం

ఐజ్వాల్: ఈ నెల 7న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించడంలో తమ పార్టీ విఫలమైనప్పటికీ, బీజేపీ మద్దతు మాత్రం తీసుకోబోమని జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) కుండబద్దలు కొట్టింది. జెడ్‌పీఎం వర్కింగ్ చైర్మన్ కె.సప్తంగ మీడియాతో మాట్లాడారు. 'రాష్ట్ర ప్రజలు కొత్త ప్రభుత్వం, కొత్త పాలనా విధానం రావాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారు సంకీర్ణప్రభుత్వాన్ని కోరుకోవడం లేదు. ఎన్నికల తర్వాత మా పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకున్నా, బీజేపీ మద్దతు తీసుకోవడం, ఆ పార్టీతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఎట్టి పరిస్థితుల్లోనూ జరగదు'అని స్పష్టం చేశారు. ఎన్నికల తర్వాత జట్టుకట్టేందుకు కాంగ్రెస్, బీజేపీలు తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల తర్వాత జెడ్‌పీఎం, అధికార ఎంఎన్ఎఫ్‌లలో ఎక్కువ సీట్లు సాధించిన పార్టీతో చేతులు కలుపుతామంటూ బీజేపీ చేసిన ప్రకటనపై పైవిధంగా సప్తంగ స్పందించారు. ఈ నెల 7న జరగనున్న ఎన్నికల్లో తమదే గెలుపని, సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.